"మీరు ఆ కులంలో, ఆ తెగలో పుట్టి ఉన్నట్లయితే ఇన్ని అర్హతలు లేకుండానే ఇంతకన్నా పెద్ద హోదాలోనూ, జీతం లోనూ మిమ్మల్ని నియమించే సావకాశం ఉంది'' అని ఇంకో ఆయన చెప్పేరు.

"ఈ రకం కేటాయింపులు పదేళ్లపాటు ఉంటాయని రాజ్యాంగం రాసినపుడు అన్నారు. ఆ పదేళ్లూ ఇంకా అవలేదా?'' అన్నాను.

"పదేళ్ల పదేళ్ల చొప్పున అలా పొడిగించుకుంటూ వస్తున్నాం. అంతెందుకు, మొన్న ఈ మధ్య ప్రభుత్వాలు పడిపోతాయని భయం పట్టుకోవడంతో ఒక్కసారిగా ముప్ఫయి లక్షల మందిని ఆ కులాల వారిని, ఈ తెగల వాళ్లనీ పిల్చి మరీ ఉద్యోగాల్లో చేర్చుకుని ఆ వోట్లన్నీ పైకి పోకుండా చూసుకోవడం అయింది. వయసు దాటిపోయినా ఫర్వాలేదు; అర్హతలు లేకపోయినా ఇబ్బంది లేదు; అర్హత ఉండీ మార్కులు నలభై శాతం తక్కువ వచ్చినా బాధలేదు. ఈ పద్ధతి ఇంకో పదేళ్లపాటు, మరో పదేళ్లపాటు కొనసాగుతుందని హామీ ఇవ్వడం కూడా అయిపోయింది.''

వాళ్లకో నమస్కారం పెట్టి, ఇంటికొచ్చి మా నాన్నగారి దగ్గర వాపోయాను. "ఏంటి నాన్నగారూ, ఈ దేశం నానాటికీ ఇలా తయారవుతోంది? నేనొచ్చేసే బదులు మీరే అక్కడికొచ్చేస్తే బాగుండేదేమో! ఈ దేశంలో ఉండాలంటే దేశభక్తి తప్ప వేరే కారణం ఏమీ కనబడ్డం లేదు!''

"ఏమో నాయనా. నీకీ ఉద్యోగం వస్తే తప్పకుండా చేరిపో. ఆ పైన దేవుడి దయ'' అన్నారు మా నాన్నగారు. ఆ మాటతో నాకన్ని సందేహాలు తీరిపోయాయి. అదే ఇంక మన దేశానికి తారకమంత్రం.

★

# 25. తలతిక్క కుదిరింది

**మా** ఆఫీసులో నాతో బాటు పనిచేసే భానుమూర్తికి "అలంకార పద్ధతిలో'' మాట్లాడ్డం సరదా. చాలాకాలం అతని మాటలు వింటూ ఇతనేమిటి, ఇలా తలతిక్కగా మాట్లాడతాడు అనుకునే వాళ్లం. కాని కొంత కాలానికి అతను "తలతిక్క పద్ధతిలో మాట్లాడ్డం'' అవతలి వాళ్లకి వెంటనే మాట తోచకుండా చెయ్యడానికేనని మాకు తెలిసింది. "నేనేం తలతిక్కగా మాట్లాడ్డం లేదు; నాకు స్క్రూలూజూ లేదు. కొన్నాళ్లు సరదాగా అలంకార శాస్త్రం చదివేను. అందులో వక్రరీతి అనే అలంకారం నాకు పట్టుబడినట్టుంది; అంతే'' అని వివరణ కూడా ఇచ్చేడు భానుమూర్తి.

ఓసారి మా సహాధ్యాయి అప్పారావు ఇంటికి కొలీగ్స్ అంతా భోజనానికి వెళ్లవలసొచ్చింది.

ఆఫీసు పనిచేసే వేళలు ఉదయం పదిగంటల నుంచి సాయింకాలం అయిదు వరకూ అయితే మధ్యలో భోజన విరామసమయం ఒక అరగంట ఉంటుంది. ఆ ప్రకారం సరిగ్గా మధ్యాహ్నం ఒంటిగంట అయ్యేసరికి ఎవళ్లమట్టుకి వాళ్లు పని ఆపేసి కేరేజీలు విప్పుకొని భోజనాల వాళ్లు భోజనాలు, టిఫిన్లు వాళ్లు టిఫిన్లు తినడం; ఆ సందర్భంగా సినిమాల గురించి, టి.వి సీరియల్సు నుంచి వార పత్రికల సీరియల్స్ వరకు గల "సీ-రియల్స్'' గురించి, రాజకీయాల

గురించి, ఆఫీసు ఫైళ్లలో మేనేజరు గారు వేసే కొర్రీల గురించి (కొండొకచో లేడీ ఎంప్లాయీస్ గురించి) ఎవరికి తోచింది వాళ్లు వాగుతూ ఆత్మస్తుతీ పరనిందా చేసుకుంటూ ఉంటారు. భానుమూర్తికీ నాకూ మధ్యాహ్నం "లంచిటైమ్" లో ఏమీ తినే అలవాటు లేకపోడాన్ని ఆ చర్చలు సాధారణంగా మేం వినడం జరగదు. ఆ వేళప్పుడు కేంటీన్‌కి వెళ్లి చెరో అరకప్పు టీ తాగి, అక్కడ న్యూస్ పేపర్లలో ఎవరికి దొరికిన "షీటు" వారు చేజిక్కించుకుని అలా చదివేసి ఇలా వొచ్చేయడం మా అలవాటు.

అప్పారావు మా సహోద్యోయులందర్నీ తన ఇంటికి భోజనానికి పిలిచిన రోజున హెడ్గుమస్తా చిరంజీవి అతని సీటు దగ్గరికొచ్చి. "ఒరే; మేనేజరు ఎవర్నయినా పిలుస్తాడేమో. మేం ఒచ్చేసరికి గంట పైగా పడుతుంది. నువ్వు కేంటీన్ పని వేగిరం తెముల్చుకుని సీట్లో ఒచ్చి కూచుని సెక్షన్ని ఓ కాపు కాయాలిసుమీ" అని చెప్పేడు. భానుమూర్తి పరధ్యానంగా "సరే, అలాగే తగలడండి" అన్నాడు.

సరిగ్గా రెండు గంటలకి మా సెక్షన్‌లో ఏదో పనుండి, ఒక ఆసామీ వచ్చాడు. రెండు నిమిషాలు అతగాడు భానుమూర్తితో ఏదో మాట్లాడేక; "మీ కాగితం మీద ఆర్డర్సు పడాలంటే మా మేనేజర్ గారొక్కరే దానికి సమర్థులు. ఇక్కడ మేం సత్రకాయలం చాలా మందిమి ఉన్నాం గాని ఒక్కడికీ ఒంట్లో నరం లేదు" అన్నాడు భానుమూర్తి .

"అదేనండీ, ఆయన్ని ఎలా పట్టుకోవడమా అని చూస్తున్నాను." అన్నాడు ఒచ్చినాయన.

"ఏముంది? సాయంకాలం ఆరు నుంచి రాత్రి ఎనిమిది వరకూ టవున్‌హాల్ రమ్మీ టేబిల్సులో ఎక్కడో ఓ దగ్గిర దొరుకుతాడు. రాత్రి ఎనిమిది నుంచి పది వరకు 'సహారా బార్' లో లాన్స్‌లో వేసే మూడు టేబిల్సులో ఒక టేబిల్ దగ్గిర ఖచ్చితంగా దొరుకుతాడు. రాత్రి పది దాటేక ఇంటి దగ్గిర దొరకలేదంటే బీచి వొడ్డున 'యవ్వనా రెస్ట్‌హౌస్' లో చూడ్డం మంచిది. ఉదయం ఏడున్నరకి లేస్తాడు. ఎనిమిది నుంచి తొమ్మిది వరకూ ఇంట్లో లక్ష్మీపూజ చేసుకుంటూ గ్యారంటీగా దొరుకుతాడు''అన్నాడు భానుమూర్తి.! ఆ పెద్దమనిషి నిర్ఘాంతపోయి. "అయ్యబాబోయ్, సకల గుణాభి రాముడేనన్నమాట'' అన్నాడు.

ఇదిగో మిష్టర్. మీరెవరో గాని, మా మేనేజరుగార్ని గురించి గొప్పగొప్ప మాటలు వాడేస్తున్నారు; జాగర్త!'' అన్నాడు భానుమూర్తి.

సరిగ్గా అప్పుడే మేనేజర్ గారి "యూనిఫారమ్" ప్యూన్ సింహాచలం వచ్చాడు. "సార్ అయ్యగారు సూపరింటుగార్ని దైచేమన్నారండీ" అన్నాడు.

"లేరు. భోజనానికెళ్లేరు.''

రెండు నిమిషాల్లో సింహాచలం మళ్లావొచ్చాడు. "సార్, సూపరింటుగారు లేకపోతే ఎడ్ గుమస్తా గార్ని పిల్చుకురమ్మన్నారండీ''అన్నాడు.

"హెచ్.సీ.గారు కూడా భోజనానికే వెళ్లేరు.''

"పోనీ బి - వన్ గుమస్తా గారుంటే ఆయన్ని పిలవమన్నారండీ''

"అదుగో, అదే; బీ వన్ సీటు. ఖాళీ, చూసేవు కదా. 'భీమన్న గారు' లేరని చెప్పు.''

"పోనీ తమరొకసారి మేనేజరు గారిక్కనపడి ఎవరూ లేరని చెప్పే కూడదా సార్?''

"నన్ను రమ్మని ఆయన చెప్పేరా; లేక నీ అంతట నువ్వే అక్కడికీ ఇక్కడికీ తిరగలేక నన్ను వెళ్లమని పురమాయిస్తున్నావా?" అని భారతంలో ద్రౌపది ప్రాతికామిని అడిగినట్టు అడిగాడు భానుమూర్తి.

సింహాచలం పరుగెత్తి కెళ్లి మేనేజర్ గారికి ఏం చెప్పేడో; అర నిమిషంలో వొచ్చి "సార్; సెక్షన్‌లో తమరు తప్పా ఎవ్వరూ లేరని చెప్పేను సార్. తమర్ని దైచేమన్నారండి సార్" అన్నాడు ఒగురుస్తూ.

"వాడెవడో అన్నాట్టలే; నీ కాపరంలో నీళ్లపొయ్యకపోతే నీ రంకు మొగుణ్ణే కాదని!" అని లేచి వెళ్లాడు భానుమూర్తి.

"ఇదేమిటోయి, నేను సూపరింటునో హెడ్‌క్లార్కునో బి-వన్ నో రమ్మంటే నువ్వొచ్చే వేమిటి?" అన్నారు మేనేజర్ గారు.

"వాళ్లందరూ భోజనానికి వెళ్లేరని సింహాచలానికి చెప్పేను సార్. నన్నేరమ్మన్నారని చెప్పేడు సార్."

"అందరూ కట్టగట్టుకుని ఒక్కసారే ఎలా వెళ్లిపోయారు? అసలు మీకు లంచి టైము ఎంత? ఇలా గంటలు గంటలు ఆఫీసు పని మానేసి భోజనాలకి వెళ్లిపోతే పని ఎలాగవుతుంది?"

"రోజూ ఇలా వెళ్ళిపోరండి. ఇవాళ బి-ఫైవ్ అప్పారావు ఇంట్లో ఏదో ఫంక్షనండి. అందుకని అందర్నీ ఆ స్పెషల్ భోజనానికి రమ్మన్నాడు. వెళ్లేరు. ఇప్పుడో ఇహనో వచ్చేస్తారండి. అంత వరకు అర్జంట్ పని ఏదైనా ఉంటే చూసేమని హెడ్డుగుమస్తాగారు నాకు చెప్పేరండి."

"మరి నువ్వెళ్లలేదేం, ఆ భోజనానికి?"

"అక్కడ ఇవాళ మాంసాహార భోజనం సార్. అందుకని-"

"ఆహా!ఓహో!! నువ్వు మహాపతివ్రతవి గాబోలు. మాంసాహారం ముట్టవుగావును!"

"అదికాదు సార్. నాకు మందులేందే ముక్క సయించదు సార్." అని అనేశాడు భానుమూర్తి; మేనేజర్ గారి కళ్లలోకి సూటిగా చూస్తూ.

మేనేజర్ గారు రివాల్వింగ్ చేర్ సాయంతో పక్కకు తిరిగిపోయి "సరే, సరే. నువ్వెళ్లు. వాళ్లు రాగానే సూపరింటుని నేను రమ్మన్నానని చెప్పు!" అన్నారు.

అక్కణ్ణించి భానుమూర్తి సరాసరి తన సీట్‌లోకి వచ్చేసరికి సిబ్బంది అందరూ వొచ్చేశారు. వెంటనే సూపరింటుగారికి మేనేజర్ గారి పిలుపు సంగతి చెప్పకుండా, తన సీటుకి ఎదురుగా కూర్చున్న ఇందాకటి పెద్దమనిషితో "అయ్యా! మీరు ఇవాళకి గప్‌చిప్‌గా ఇంటికి వెళ్లిపోండి. రెండు మూడు రోజులు పోతేగాని మా మేనేజర్ గార్ని కలవొద్దు. మీ మంచికోరి చెబుతున్నాను" అని చెప్పేడు.

"అయి, అయి, అలాగేండి" అని వెళ్లాడతను.

ఆ తరవాత భానుమూర్తి జరిగిన సంగతంతా అందరికీ చెప్పేశాడు. అందరూ "బలే దెబ్బ కొట్టేవుగురూ!" అని భానుమూర్తిని మెచ్చుకున్నారు.

సాయంకాలానికల్లా ఆర్డర్సు వచ్చాయి; భానుమూర్తిని రికార్డు సెక్షన్‌కి ట్రాన్స్‌ఫర్ చేస్తూనూ.

★